



# సాహితీమూర్తుల సహవాసం
## - నరిశెట్టి ఇన్నయ్య



శ్రీ నరిశెట్టి ఇన్నయ్యగారు ప్రముఖ పాత్రికేయులు, రచయిత, మానవతావాది, హేతువాది. ఎంతోమంది సాహితీమూర్తులతో ఆయనకి సన్నిహిత పరిచయాలున్నాయి. ఒక్కో సాహితీమూర్తితో తన స్నేహ పరిమళాలని నెలకొకటిగా ఈ శీర్షికలో కౌముది పాఠకులతో పంచుకుంటున్నారు.

## 3

# ఎవరీ బాలబంధు?



*"కులం మాది బాల-కులం*
*కుళ్ళు కుత్సిత మెరుగని*
*కల్లాకపటం తెలియని*
*కులం మాది బాల-కులం"*

అంటూ పిల్లలకు గేయాలు పరంపరగా రాసిన వారే. భారత స్వాతంత్ర్యోద్యమ సందర్భంగా సాంఘిక విమోచన కావాలనే ధోరణిలో ఎందరో రచయితలు పూనుకున్నారు.

అయితే పిల్లలకు మాత్రం మూఢనమ్మకాలు, పిచ్చి పిచ్చి సామెతలు, అర్థం పర్థం లేని కోరికలు తెచ్చిపెట్టి పెద్దబాలశిక్షను నూరిపోశారు. అందుకు భిన్నంగా పిల్లలకు వైజ్ఞానిక దృక్పథంతో శాస్త్రీయంగా తీరుగా, రీతిగా ఆకర్షణీయంగా రాసిన వ్యక్తి బి.వి.నరసింహారావు. అందుకే ఆయనకు సాహిత్య అకాడమీ ఇచ్చిన 'బాలబంధు' అనే బిరుదు సార్థకమైంది. పిల్లల మధ్య

తిరుగాడుతూ, నాట్యం చేస్తూ అభినయంతో గేయాలు వినిపించిన బాలబంధు అందరికంటే ముందే చలం రాసిన 'బిడ్డల శిక్షణ' చదవమని, ఆచరించమని గట్టిగా చెప్పాడు. స్కూళ్ళ ఇన్స్ పెక్టర్ కావడంతో అనేకచోట్లకు పర్యటన చేసి తన ఉద్యోగాన్ని సార్థకం చేశాడు.

**''పిల్లలకు పాటలవి కొల్లలగ రాస్తా**

**ప్రేమతో వారికవి పిలిచి వినిపిస్తా''**

అలాగే తిరిగి, వినిపించి మురిపించాడు. అందుకే ఆయన పాటలన్నా ఆటలన్నా పిల్లలు ఎదురు చూసి విని ఆనందించేవారు. ఈనాడు పిల్లలకు సరైన ఆకర్షణీయమైన గేయాలు కరువైపోయాయి. కానీ బాలబంధు గేయాలు కాలదోషం పట్టకుండా ఇప్పటికీ ఉన్నాయి. వాటిని పాఠ్యగ్రంథాలుగా పెట్టటమే కాక ఇంటర్నెట్ లో కూడా ప్రచారం చేయాల్సిన ఆవశ్యకత ఉన్నది. ప్రాచీన కవుల వ్యాసాలు కూడా నేడు హేతుబద్ధంగా చెప్పటం అవసరమంటారాయన. కొన్ని వ్యాసాలు రాసి వివిధ పత్రికలలో ప్రచురించారు. '*పిల్లల్ని కనడం కన్నా పెంచడం కష్టమ*'ని బి.వి. భావన. వారి మనస్సులు విచిత్రమైనవని వారి యక్ష ప్రశ్నలు అర్థంచేసుకోవడానికి ప్రయత్నించాలని బాలబంధు నొక్కి చెప్పాడు. ఆయన వేసి యక్షప్రశ్నలలో పేర్కొనదగినది –

**''ఆకలందరి కుండునెందుకు ?**

**అన్నమందరి కుండదెందుకు ?''**

అంతేకాక '*ప్రతి పిల్లవాడూ ఓ ప్రశ్న*' అని పిల్లల భాషను అనుకరించగలం గాని వారి భావాలను అనుకరించటం కష్టం అని బి.వి. స్పష్టంగా చెప్పారు. '*వర్ణ, వర్గ రాజకీయాలకతీతంగా పిల్లలను పెంచి చదివించాల*'ని బి.వి. దృఢమైన అభిప్రాయం వెల్లడించారు.

పిల్లలకు ఎన్నో నీతి కథలు రాసిన బాలబంధు 'ఆవు హరిశ్చంద్ర' కథలో తన స్వార్థం కోసం, కీర్తి కండూతితో భార్యాపిల్లల్ని తాకట్టు పెట్టిన హరిశ్చంద్రుడికంటే అన్న మాట నిలబెట్టుకోవడానికి తన బిడ్డకు పాలిచ్చి వచ్చి పులికి బలిగావడానికి సిద్ధపడిన ఆవు నుండి గొప్ప నీతి నేర్చుకోవాలని అన్నాడు. బాలబంధుగా బి.వి. మారక ముందు తొలి దశ అంతా 'అనార్కలి నరసింహారావు'గా పేరొందాడు.





**బి.వి. నటజీవితం**

1924లోనే విశ్వనాథ సత్యనారాయణ యవ్వనదశలో వుండగా రాసిన రసవత్తరమైన అనార్కలి నాటకాన్ని 1934లో ప్రదర్శనకు చేపట్టారు. కాకినాడలోని మెక్లేర్ స్కూలులో బి.వి. అనార్కలి పాత్ర వేయగా, నీలంరాజు వెంకటశేషయ్య (ఉత్తరోత్తర ఆంధ్రప్రభ ఎడిటర్) సలీం పాత్ర వేశారు. అప్పటి నుండి రెండు దశాబ్దాల పాటు 'అనార్కలి నరసింహారావు'గానే చలామణి అయ్యారు. ఆ తరవాత

అనార్కలి నాటకాన్ని మదరాసు, రాజమండ్రి., పాలకొల్లు, గుంటూరు మొదలైన ప్రాంతాలలో నటించారు. ఆయన స్త్రీ పాత్రలు ధరించి పేరు తెచ్చుకున్న వాటిలో మోహిని, రాధ, చింతామణి, సత్యభామ మొదలైన పాత్రలు పేర్కొనదగినవి. బి.వి.కి అభినయంలో తోడ్పడినవారు అక్కినేని నాగేశ్వరరావు, కిళాంబి కృష్ణమాచార్యులు. స్త్రీ పాత్రలు వేస్తుండగా ఆశ్చర్యపడి మెచ్చుకున్న వారిలో స్థానం నరసింహారావు, ఆదిభట్ల నారాయణరాజు, గిడుగు రామమూర్తి, తాపీ ధర్మారావు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, బందా కనకలింగేశ్వరరావు. జయపురం సంస్థానాధీశులు శ్రీశ్రీశ్రీ విక్రమదేవ వర్మ ఆయన నాట్యం చూసి ముగ్ధులై 'నరసింహారావు నరసమ్మ అయితే బాగుండేది' అని ఆయన తన రసిక ప్రియత్వాన్ని చాటుకున్నారు. సి.ఎస్.ఆర్., నగరాజారావు, జొన్నవిత్తుల, అద్దంకి, కస్తూరి శివరావు, రేలంగి వెంకట్రామయ్య, ఫన్ డాక్టర్ చంద్రశేఖర్, పువ్వుల సూరిబాబు, దొమ్మేటి సూర్యనారాయణ, ముసిడి జగ్గరాజు, ఈమని వెంకట్రామయ్య, పులిపాక వెంకటేశ్వర్లు వంటి వారితో కలిసి నటించారు. మునిమాణిక్యం నరసింహారావు వీరికి సన్నిహితంగా వుండేవారు. 'దాసిగా నుండనైనా తగనా' అనే బసవరాజు అప్పారావు గేయాన్ని, నండూరివారి 'ఉత్తమ ఇల్లాలినోయీ' అభినయ పూర్వకంగా వేదికపై ప్రదర్శించారు.

**ప్రముఖులతో బి.వి.**

తొలిదశలో బి.వి.నరసింహారావును ప్రభావితం చేసినవారిలో గోరా (గోపరాజు రామచంద్రరావు) ఉన్నారు. ఆయన ఆరోజులలోనే కృష్ణాజిల్లాలో హరిజనవాడలో గుడిసె వేసుకుని వారిమధ్య నివసించి అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడటం బి.వి.ని ఆకట్టుంది. గోరా సంతానం కులాంతర, మతాంతర వివాహాలు చేసుకోవటం, పెళ్ళి ప్రమాణాలలో మతతత్వాలు లేకుండా సెక్యులర్ గా ఉండటం బి.వి.ని బాగా ఆకర్షించింది. ఆయన కూడా అలాంటి పెళ్ళిళ్ళే తరవాత చేయించాడు.



గుంటూరులో యలవర్తి రోశయ్య, తెనాలిలో ఆవుల గోపాలకృష్ణమూర్తితో సన్నిహితంగా వుంటూ హేతువాద భావాలు రూపొందించుకొని వాటినే గేయాలలో పొందుపరిచారు. .

బెర్ట్రండ్ రస్సెల్ పిల్లల మనస్తత్వాన్ని పరిశీలించి రాసిన తీరు బి.వి.ని ఆకట్టుకున్నది. అలాగే ఠాగోర్ రాసిన నెలవంక గ్రంథస్తం చేశారు.

విజయవాడనుండి 'చిరుమువ్వలు' బాలల పత్రికకు 12 సంచికలకు సంపాదకత్వం వహించారు. ఇంగ్లీషులో కూడా బాలల రైమ్స్ కొన్ని రాశారు. రాజేంద్రప్రసాద్ ప్రచురించారు.

బి.వి.కి తొలిదశ నుండి అత్యంత సన్నిహితుడైన వ్యక్తి గుడిపాటి వెంకటాచలం. బి.వి.కి చలానికి మధ్య సాగిన ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ పుస్తకంగా తెచ్చారు. చలం తెనిగించిన రవీంద్రనాథ్ ఠాగోర్ గీతాంజలికి 'అనుమేళన' అనే శీర్షికతో సంజీవదేవ్ సుదీర్ఘ

తుదిపలుకులు రాశాడు. బి.వి. అది తీసుకొని సంజీవదేవ్ ను నార్ల చిరంజీవిని వెంటబెట్టుకుని అరుణాచలంలో ఉంటున్న చలం దగ్గరకు వెళ్ళి సంతృప్తిగా ఆ రచనలు ఇచ్చాడు. కానీ ఉత్తరోత్తరా వచ్చిన పుస్తకాలలో సంజీవదేవ్ 'అనుమేళన' చెప్పకుండానే తొలగించిడం ఆశ్చర్యకరం.

**నాట్యంలోనూ బి.వి. ప్రతిభ**

శ్రీ శ్రీ రాసిన

**''ఆనందం అర్ణవమైతే**
**అనురాగం అంబరమైతే**
**అనురాగపు టంచులు చూస్తాం**
**ఆనందపు లోతులు తీస్తాం.**

**నీ కంకణ నిక్వాణంలో**
**నా జీవన నిర్వాణంలో**
**నీ మదిలో డోలలు తూగి**
**నా హృదిలో జ్వాలలు రేగి.**

**నీ తలపున రేకులు పూస్తే**
**నా వలపున బాకులు పూస్తే**
**మరణానికి ప్రాణం పోస్తాం**
**స్వర్గానికి నిచ్చెన వేస్తాం''**

గేయానికి బి.వి. వేదికపై స్త్రీ వేషధారణలో అభినయం చేస్తే స్వయంగా శ్రీశ్రీ తన స్నేహితులను వెంటబెట్టుకుని వచ్చి మురిసిపోయేవాడు. అలాగే కొనకళ్ళ రాసిన

**''మొక్కజొన్న తోటలో**
**ముసిరిన సీకట్లలో**
**మంచెకాడ కలుసుకో**
**మరువకు మామయ్య''** పాటకు

తన శైలిలో అభినయం చేశారు.

## సంక్షిప్తంగా జీవితం

బి.వి. నరసింహారావు పూర్తిపేరు బాడిగ వెంకట నరసింహారావు(1013-1994). తల్లిదండ్రులు వెంకట సుబ్బమ్మ, వెంకట సుబ్బయ్య. కృష్ణాజిల్లా గుడివాడ సమీపంలో కౌతరం గ్రామానికి చెందినవారు. కారణం తెలీదు కాని 7 సంవత్సరాల వరకు బి.వి. బడికి పోలేదు. ఆ తరువాత ఊళ్ళోనే ప్రాథమిక విద్యను పూర్తిచేసి కాకినాడ మెక్లేర్ హైస్కూలులో తదనంతరం రాజమండ్రిలో టీచర్ ట్రైనింగ్ శిక్షణ పొంది కొన్నాళ్ళు డ్రాయింగ్ మాస్టర్ గా పనిచేశారు. తరువాత స్కూల్స్ ఇన్స్ పెక్టర్ కావడం వలన పిల్లల మధ్య సంచరించడానికి వారి మనస్తత్వం తెలుసుకోవడానికి వారికి ఇష్టమయిన గేయాలు రాయడానికి అవకాశాన్ని ఉపయోగించుకున్నారు. కాలాతీతంగా ఆ గేయాలు ఉండటం విశేషం.

## ఆయన రచనలు

"బాలరసాలు, పాలబడి పాటలు, చిన్నారిలోకం, బాలలోకం, పూలబాలలు, నా కథలు, ఉత్తరాల రత్తయ్య, దిరిశెనపూలు, ప్రియదర్శి, రుతురాణి, అమ్మఒడి, వెన్నెలబడి, మున్నీ గీతాలు, బాలసాహిత్యం, భీమసేనుడు, చైతన్య బాలగీతాలు, నేను ఏమనాలి?, బాలబంధు రైమ్సు (ఇంగ్లీషు)" ఇవి ఆయన ఇతర రచనలు. బాలబంధు 'జీవనరేఖలు' పేరిట తన స్వీయ చరిత్రను స్వయంగా రాసుకున్నారు. పదవిపంచి, "జిబ్రాన్ సూక్తులు, మాన్యశ్రీ, కల్యాణ కౌముది, ఆంధ్రభాషా పదావళి" వంటి 30 గ్రంథాలను వీరు రచించారు.

## బి.వి.తో నా పరిచయం

నాతో 1965 నుండి బి.వి. సన్నిహిత మిత్రులయ్యారు. అప్పటికే నాట్యం మానేశారు. ఇంటికి వచ్చి తన రచనలను అందించి చర్చలు చేసేవారు. ఆయన ఉన్నంత సేపు ఆ ఇల్లు నాదా బి.వి.దా అనిపించినట్లుండేది. అలా కలిసిపోవడం ప్రభావితం చెయ్యడం బి.వి. ప్రత్యేకత. ఈనాడు ఆయన రచనలు పిల్లలకు అందజేస్తే మనం ఎంతో సేవచేసినవారమవుతాం. ప్రముఖ హేతువాది, ఎడిటర్ నార్ల వెంకటేశ్వర రావు ఆయనకు సలహా ఇస్తూ జీవితమంతా నాట్యానికి అంకితమైన మీరు అదొక కళగా చేపట్టి పెంపొందించటం మంచిదని చెప్పారు. అందుకు బి.వి. సుముఖత వ్యక్తం చేశారు.

సుప్రసిద్ధ హేతువాది రావిపూడి వెంకటాద్రి 'భారత కమ్యూనిజం' అనే ఉద్గ్రంథం రాయగా దాని ప్రచురణకు బి.వి. పూనుకొని గోరా అల్లుడు అర్జున్ రావు, గుడివాడలో మరొక మిత్రుడు రాఘవరావు సాయంతో ఆర్థిక సహకారం అందించగలిగాడు.

స్త్రీ విమోచన రచయిత చలం శతజయింతి సభలో 1994, జనవరి 6న విజయవాడలో జరుగుతుండగా ఆయన చిరకాల మిత్రుడు సన్నిహితుడు బాలబంధు బి.వి. నరసింహారావు ప్రసంగించటానికి లేచి వేదికపైనే గుండెపోటుతో మరణించారు. అది అందరినీ కదిలించిన సన్నివేశం. అలాంటి బి.వి.నరసింహారావు పిల్లల పాటలు వైజ్ఞానిక దృక్పథంలో ఆకర్షణీయంగా పాడిన ఆద్యుడు. ఆయన ఆరంగేట్రం అనార్కలి స్టేజినాటకం తెలుగువారిలో అత్యంత ఆకర్షణీయ నటనగా వుండిపోయింది.

బి.వి. గేయాల్లో ఇదొక సుప్రసిద్ధ గేయం గమనించండి.

**"పిట్టల్లారా.. ఉడుతల్లారా...**

**బుడుతల్లారా...**

**ఏమీ ఎరుగని పువ్వుల్లారా..**

**ఐదారేళ్ళ పాపల్లారా...**

**ఈ నా గీతం వింటారా...**

**నిత్యం మీతోనే వుంటాను "**

(1958లో ఆయన రాశారు.)

ఇటువంటి నరసింహారావు గేయాలు ప్రతి బడిలోనూ పిల్లలకు నేర్పాలి. ఆయన గేయాలన్నీ మళ్ళీ ప్రచురించాలి. అంత శాస్త్రీయంగా పిల్లల విద్యపట్ల శ్రద్ధ చూపిన బి.వి.కి పునరుద్ధరణ జరగాలి.

(మరో సాహితీమూర్తితో సహవాసం గురించి వచ్చే సంచికలో)

COMMENTS